"సారీ ఫాదర్ ఏక్స్‌పైర్డ్" అన్నది రెండవ టెలిగ్రాం గంగరాజు స్వగ్రామంనుంచి గంగరాజు శెలవుమీద వున్న అయిదవరోజు శుక్రవారం చేరింది ఆఫీస్‌కి బొంబాయిలో వున్నప్పుడు.

తట్టుకోలేక, గంగరాజు ఆఫీసర్ ఎదురుగా వున్న కుర్చీలో కూలబడ్డాడు.

# దిలావర్

ఆరోజు పోస్టులో వచ్చిన రెండు కవర్లని ఆత్రంగా చింపి చదివాడు సోమయాజి. ఆ రెండు కవర్లమీద అతను ఇదివరకు ఇంటర్వ్యూకి వెళ్ళిన కంపెనీ చిరునామాలు ముద్రించి వుండటంతో అతనిలో ఆ ఆత్రం.

రెండు రిగ్రెట్ లెటర్సే

చిన్నగా నిట్టూర్చాడు సోమయాజి. వాటితో కలిసి నూట అరవై రెండు రిగ్రెట్ లెటర్స్ చూసాడు అతను ఇంతదాకా.

ఇంట్లోంచి బయట పడ్డాక ఏం చేయాలో తోచలేదు. మార్నింగ్ షో సినిమాకి వెళదామంటే డబ్బులేదు టీ తాగినా ఇరానీ రెస్టారెంట్‌లో ఎంత సేపు కూర్చుంటాడు!

బస్‌లో ఇందిరా పార్కుకి చేరుకున్నాడు. వారం, పదిరోజులకో సారి అతను తనసమయాన్ని అక్కడ గడుపుతుంటాడు. అలవాటు ప్రకారం ముందర పార్కంతా తిరిగాడు తర్వాత ఓ చెట్టు నీడలో, పచ్చగడ్డిమీద పడుకున్నాడు. ఆకాశం వంక చూస్తూ తన మనస్సుని ఆలోచనా రహితంగా వుంచటానికి విఫల ప్రయత్నం చేయసాగాడు. వద్దనుకున్నకొద్దీ అతని మనసు నిండా ఆలోచనలు కలగాపులంగ అల్లుకో సాగాయి.

ఎల్.ఐ.సి కి పంపిన అప్లికేషన్.

ఎంప్లాయి మెంటు ఎక్స్ఛేంజినించి వుద్యోగానికి మళ్ళీ కాల్ ఎప్పుడు వస్తుందో? ఎలా తెప్పించుకోవడం?

స్టాఫ్ సెలక్షన్ కమిటీ వాళ్ళు ఇంటర్వ్యూకి పిలుస్తారా? తను రిటెన్ టెస్ట్ బాగానే రాసాడు.

తనవూరి ఎం.ఎల్.ఏ చేత రికమెండ్ చేయించిన పి.డబ్ల్యు.డి. వుద్యోగం వస్తుందా, రాదా?

అక్నాలెడ్జ్‌మెంట్ కార్డ్స్ ఇంటికివెళుతో పోస్టాఫీస్‌నించి తీసు కెళ్ళాలి అలాగే అయిదు రూపాయల పోస్టల్ ఆర్డర్ కూడా.

తల విదిలించాడు ఆలోచన మీద ఆలోచన రావటంతో లేచికూర్చు న్నాడు. దూరంగా పన్నెండు పదమూలుగేళ్ళ మధ్యపిల్లలు డిస్క్ త్రో ఆడుకుంటున్నారు. యునిఫాంలో వున్న వాళ్ళని. స్కూలు పిల్లలుగా గుర్తించాడు. వాళ్ళతో వచ్చిన టీచర్ వాళ్ళు పోట్లాడుకోకుండా చూస్తూ ఆడిస్తోంది.

కళ్ళు మూసుకున్నాడు. చెట్టనీడకి, చల్లగాలికి నిద్రపట్టింది సోమ యాజికి. దాదాపు పది నిమిషాలు తర్వాత మెలకువ వచ్చింది కళ్ళు తెరిచాడు. తనకి పది గజాల దూరంలో యునిఫాంలో వున్న ఓ పాప నిలబడి చూస్తుండటం గమనించాడు.

ఇద్దరి కళ్ళు కలుసుకోగానే చిన్నగా నవ్వింది ఆ అమ్మాయి, సోమయాజి పలకరింపుగా నవ్వి లేచి కూర్చున్నాడు.

ఆ పిల్లకి పన్నెండేళ్ళు వుంటాయనుకున్నాడు. నీలం రంగు గౌను లో ఉంది బాబ్డ్ హెయిర్‌లో చూడముచ్చటగా వుంది.

దగ్గరికి వచ్చి పక్కన కూర్చుంది.

"నీ పేరేమిటి?" ప్రశ్నించింది ఇంగ్లీషులో

"సోమయాజి" చెప్పాడు.

ఆ అమ్మాయి కళ్ళు ఎంతో చురుగ్గా చూస్తున్నాయి. ఆ అమ్మాయిలోని శక్తి ఆ చూపు ద్వారా బహిర్గతం అవుతోందా అనేంత హుషారుగా వుంది చూపు.

"మాస్కూల్ వాళ్ళు పిక్నిక్‌కి తీసుకు వచ్చారు" చెప్పింది.

"ఏం స్కూల్" అడిగాడు.

"నెహ్రూ మెమోరియల్"

"ఎక్కడుంది!"

"మౌలాలీ.... ఏమిటి ఆలోచిస్తున్నావ్!"

"ఏం లేదు"

"ఏదో వుంది చెప్పు"

"రేపు కాంతి కిరణ్ కంపెనీ వాళ్ళ ఇంటర్వ్యూకి వెళ్తున్నాను. ఉద్యోగం వస్తుందా రాదా అని

"కాంతి కిరణ్ అడ్వర్ టైజింగ్ కంపెనీయా!" అడిగింది ఆ పాప వెంటనే.

"కాదు కాంతి కిరణ్ టెక్స్‌టైల్స్"

"మా నాన్నగారు అందులో జి.యం.గా పని చేస్తున్నారు.

"కాంతి కిరణ్ టెక్స్‌టైల్స్ లోనా! పేరు!" ఆనందంగా అడిగాడు.

"దిలావర్"

"అలాగా!"

ఇద్దరూ కాసేపు మౌనంగా వుండి పోయారు.

"నే చెపాలే మా నాన్న గారితో. ఆయన నామాట వింటారు. దిగులు పడకు. ఉద్యోగం ఇప్పిస్తాలే."

నీటిలో మునిగే వాడికి గడ్డి పోచ దొరికి నట్టయింది సోమయాజికి.

"మర్చిపోకుండా చెప్తావా!"

"ఆ"

సోమయాజి తన పేరు మరోసారి చెప్పాడు.

"సోమయాజేగా. గుర్తుందిలే"

"నీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను పాపా"

"వెళతాను. మా టీచర్ ఎదురు చూస్తూంటుంది. మా నాన్న గారికి నువ్వు గుర్తుచెయ్యి నేను చెప్పానని"

ఆ రాత్రంతా సోమయాజి సంతోషంగా వున్నాడు మర్నాడు ఇంటర్వ్యూకి వెళ్ళాక సోమయాజి జి.యం. పేరు దిలావరేనా అడిగాడు ప్యూన్‌ని.

కాదు

కొద్దిగా నిరుత్సాహ పడ్డాడు.

ఆ వుద్యోగానికి ఎన్నిక చేయబడలేదు సోమయాజి.

మరో నెల ఆతర్వాత అబిడ్స్‌లో నడచి వెళుతుంటే మినీ బస్‌లో వెళ్ళే ఎవరో పిలుస్తే చూశాడు.

ఆ పాపే.

"ఉద్యోగం వచ్చిందా!" అడిగింది వుత్సాహంగా.

సోమయాజి జవాబు చెప్పటానికి నోరు తెరచాడు కానీ ఆమినీ బస్ మీది అక్షరాలు చదివి ఆగిపోయాడు.

"నెహ్రూ మెమోరియల్ స్కూల్ ఫర్ ది మెంటల్లీ డిసేబిల్డ్"

"రాలేదా! ఈసారి నువ్వు ఎక్కడికైనా ఇంటర్వ్యూకి వెళ్ళినపుడు మా నాన్నతో చెప్పు. ఆయన నేనిమ్మన్నానంటే వుద్యోగం యిస్తారు. చెప్పాగా. మా నాన్నగారి పేరు దిలావర్" చెప్పిందా పాప.

ట్రాఫిక్ లైట్స్ మారడంతో ఆ బస్ కదలి వెళ్ళిపోయింది.